# ప్రజాశక్తి

మంగళవారం 10 జనవరి 2023

5

అల్లూరి సీతారామరాజు

## జిల్లాలో త్వరితగతిన సర్వే

**ప్రజాశక్తి-పాడేరు:** జిల్లాలోని సర్వేయర్లకు మెడికల్ కిట్లు, రెయిన్ కోట్లు, బ్యాగులు జియో సిమ్ కార్డులు తదితర వాటిని సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో 330 మంది సర్వేయర్లకు కిట్లను పంపిణీ చేయాలని సర్వే శాఖ అధికారులకు ఆదేశించారు. జిల్లాలో సర్వే ప్రక్రియ వేగంగా పూర్తి చేయాలని ఈ సందర్భంగా సర్వేయర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో సర్వే శాఖ సహాయ సంచాలకులు వై. మోహనరావు తోపాటు శాఖ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

కిట్లను అందజేస్తున్న కలెక్టర్

# ఫలించిన పోరాటం

- విధుల్లోకి చేరాలని మాతృ భాషా వాలంటీర్లకు ఉత్తర్వులు
- రెండేళ్ల సుదీర్ఘ పోరాటానికి తలొగ్గిన ప్రభుత్వం
- ఎపి గిరిజన సంఘం ఆధ్వర్యంలో విజయోత్సవం
- కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత కల్పించాలి : అప్పలనర్స



భాషా వాలంటీర్లకు స్వీటును తినిపిస్తున్న అప్పలనర్స

**ప్రజాశక్తి-పాడేరు:** పాడేరు ఏజెన్సీలోని ప్రాథమిక పాఠశాలల్లో పని చేస్తున్న మాతృభాష వాలంటీర్ల సుదీర్ఘ పోరాటం ఫలించింది. ఐటీడీఏ అలక్ష్యం మూలంగా రెండేళ్లుగా భాషా వలంటీర్లు విధులకు దూరంగా ఉన్నారు. గడిచిన రెండేళ్ల కాలంలో పలుసార్లు ఏపీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో భాషా వాలంటీర్లు తమను కొనసాగించాలని కోరుతూ ఆందోళనలు కొనసా గించారు. ఎట్టకేలకు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ చొరవతో భాషా వాలంటీర్లు విధుల్లోకి చేరేందుకు ప్రభుత్వం నుంచి అనుమతి లభించింది. ఆదివాసి మాతృభాష విద్య వాలంటీర్లు విధుల్లోకి చేరాలని జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి వచ్చిన మౌలిక ఆదేశాల మేరకు గిరిజన సంఘం కార్యాలయంలో సోమవారం సాయంత్రం ఏపీ గిరిజన సంఘం నేతలతో కలిసి భాష వలంటీర్లు మిఠాయిలు పంచుకొని విజయోత్సవం జరుపుకున్నారు.

**ఉద్యోగ భద్రత కల్పించాలి:**
**గిరిజన సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు పి అప్పలనరస**

ఈ సందర్భంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో గిరిజన సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు పి అప్పలనరస మాట్లాడుతూ, గిరిజన ప్రాంతంలో ఆదివాసి మాతృభాష విద్యా వలంటీర్లను విధుల్లోకి తీసుకోవాలని, గత రెండు సమస్యల నుండి నిర్వహించిన సుదీర్ఘ పోరాట ఫలితంగా విధుల్లోకి తీసుకోవాలని తెలిపారు. రెండేళ్లుగా భాష వాలంటీర్లను కొనసాగించకపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 39 వేల మంది ఆదివాసి చిన్నారులకు మాతృభాష విద్యా బోధన అందని ద్రాక్షగా మారిందని, 1200 మంది మాతృభాషా విద్యా వాలంటీర్లు రాష్ట్ర వ్యాప్తంగా విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. వీరిని 2019లో విధుల నుండి తొలగించారని, నిధులు లేవంటూ విధుల్లోకి తీసుకోకుండా గత రెండు సంవత్సరాల నుండి ఆదివాసి మాతృభాష వాలంటీర్లను నానా ఇబ్బందులకు గురి చేశారని విమర్శించారు. సమస్యలు పరిష్కరించాలని ఐటీడీఏ ముట్టడి, 24 గంటల దీక్షలు, రాష్ట్ర వ్యాప్తంగా బంద్ కూడా నిర్వహించిన ఫలితంగా ఎట్టకేలకు అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఆదివాసి మాతృభాషా విద్యా వాలటీర్లను విధుల్లోకి తీసుకున్నారని, ఈ మేరకు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, అల్లూరి జిల్లా విద్యాశాఖ అధికారి ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. ఆదేశాలను అనుసరించి మాతృభాష విద్యా వాలంటీర్లు విధుల్లోకి చేరాలని, విద్యాశాఖ కార్యాలయం నుండి మౌలిక ఆదేశాలు జారీ అయ్యాయని చెప్పారు. జనవరి నెల జీతాలు చెల్లిస్తామని, భవిష్యత్తులో పాడేరు ఐటిడిఏకి కేటాయించిన కోటి 89 లక్షలతో జీతాలు ఇస్తామని జిల్లా కలెక్టర్ ఆదివాసి మాతృభాష వాలంటీర్లకు తెలియజేశారన్నారు. ఉన్నత విద్యావంతులైన ఆదివాసి మాతృభాష విద్యా వాలంటీర్లు మారుమూల ప్రాంతాల్లో కూడా ఆదివాసి చిన్నారులకు విద్య అందించే సమర్థవంతమైన బాధ్యతను నిర్వహిస్తున్నారని, వారికి కనీస వేతనం ప్రభుత్వ నిబంధన ప్రకారం చెల్లించాలని ఉద్యోగ భద్రత కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఐఏఎస్ అధికారులు ఉండగా సలహాదారుల పేరుతో రాష్ట్ర ప్రభుత్వం కోట్లాది రూపాయలు వృథా ఖర్చు పెడుతుందని, భాషా వాలంటీర్లకు నిధులు లేవని చెప్పడం సరికాదన్నారు.

**కలెక్టర్‌కు ధన్యవాదాలు**

ఆదివాసి మాతృభాష విద్యా వాలంటీర్ల రెన్యూవల్ కోసం విశేషమైన కృషి చేసిన అల్లూరి జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు, భాష వలంటీర్ల ఉద్యమానికి సహకరించిన గిరిజన సంఘం, ప్రజా సంఘాల నేతలకు ప్రత్యేకమైన ధన్యవాదాలను భాషా వాలంటీర్ల సంఘం రాష్ట్ర, జిల్లా అధ్యక్షులు పి.శ్రీను, కె.సర్భనాయుడు, డివిజన్ నాయకులు చిట్టిబాబు, రాంబాబు, శ్రీను, తదితరులు తెలిపారు.

ప్రజల సమస్యలు వింటున్న రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం బన్సల్

## స్పందనకు 39 అర్జీలు

**ప్రజాశక్తి - రంపచోడవరం**

స్థానిక ఐటిడిఎ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో 39 అర్జీలు సమర్పించారు. రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం బన్సల్, ఐటీడీఏ ఎపీఓ జనరల్ సిహెచ్.శ్రీనివాసరావు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అడ్డతీగల మండలం ధాన్యం బాల్యం పంచాయతీలోని చాపరాతిపాలెం, చిన్న ముకనగడ్డ గ్రామాలలో పక్క స్కూలు భవనాలు నిర్మించాలని, రావులపాడు, పినికిలపాడు మధ్యలో గల ఐదు కిలోమీటర్ల రహదారిని బీటీ రోడ్డుగా ఏర్పాటు చేయాలని ధాన్యం పాలెం సర్పంచ్ ఈక వెంకాయమ్మ, ఈక మహాలక్ష్మి, కురుసం చిన్నాలు దొర స్పందనలో విజ్ఞప్తి చేశారు. దేవీ పట్టణం మండలం ఇందుకూరు పేట గ్రామంలోని తమ భూ సమస్య పరిష్కరించాలని చల్లాబత్తుల రామకృష్ణ దరఖాస్తు సమర్పించారు. రాజవొమ్మంగి మండలం జడ్డంగి గ్రామంలో తన భర్త చనిపోయారని, వైఎస్ఆర్ బీమా మంజూరు చేయాలని జి.సూర్య ప్రభ కోరారు. తన వయసు 60 సంవత్సరాలు దాటిందని, ఎటువంటి ఆధారాం లేదని, పింఛన్ మంజూరు చేయాలని దేవీపట్నం మండలం శరభవారం గ్రామానికి చెందిన మిట్టపల్లి సింహాచలం దరఖాస్తు సమర్పించారు. ఎంబీఏ చదువుకొని ఖాళీగా ఉంటున్నానని, ఉపాధి కల్పించాలని రంపచోడవరం మండలం సిరిగిందలపాడు గ్రామానికి చెందిన బిఎం.సుజాత విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ దరఖాస్తులను పరిశీలించి ఆ సమస్యలు పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు జి.డేవిడ్ రాజ్. ఎండి యూసఫ్, వెలుగు ఏపిడి ఎ.శ్రీనివాసరావు, డిఎల్‌డిఓ కె.కోటేశ్వరరావు, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కల్పన, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

గిరిజన సమస్యలపై

## పిఓ మొండి వైఖరి విడనాడాలి

**22వ రోజు కొనసాగిన రిలే దీక్షలు**

దీక్ష చేపడుతున్న నేతలు

**ప్రజాశక్తి-పాడేరు:** గిరిజన సమస్యల పరిష్కారంపై ఐటీడీఏ పీవో రోనంకి గోపాలకష్ణ మొండి వైఖరిని విడనాడాలని ప్రజా సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ కూడా రాధాకృష్ణ, కోకన్వీనర్ కిల్లో ప్రభుదాస్ డిమాండ్ చేశారు. ఐటీడీఏ ఎదుట ప్రజా సంఘాలు చేపట్టిన రిలే నిరాహార దీక్ష సోమవారం 22వ రోజు కొనసాగాయి. ఈ దీక్షలనుదేశించి వారు మాట్లాడుతూ, గిరిజన సంక్షేమం, అభివృద్ధిని పిఓ విస్మరించారని విమర్శించారు. కాఫీ రైతులకు ఐటీడీఏ ద్వారా ప్రోత్సాహకాల చెల్లించ లేదన్నారు. కాఫీ కొనుగోలులో గిరిజన రైతులను మోసం చేస్తున్నారని ఆరోపించారు. ఒక ప్రైవేటు సంస్థతో గిరిజన రైతుల నుంచి తక్కువ ధరకు కాఫీ కొనుగోలు చేయడానికి పిఓ ప్రోత్సహిస్తున్నారని విమర్శించారు. ఐటీడీఏ అధికారిగా గిరిజనులకు రక్షణ కల్పించాల్సింది పోయి ఇటువంటి విధానాలకు పిఓ పాల్పడటం సరికాదన్నారు. పీవోను తక్షణమే సరెండర్ చేయాలని డిమాండ్ చేశారు. 22 రోజులుగా తాము రిలే నిరాహార దీక్ష చేస్తున్నప్పటికీ గిరిజన సమస్యలపై స్పందించకుండా అధికారులు ఏకపక్షంగా, నిర్లక్ష్యంగా ఉండటం సరికాదన్నారు. సమస్యలు పరిష్కరించే వరకు తాము పోరాటం కొనసాగిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల వేదిక నాయకులు చిన్నారావు, బత్తిరి నరేష్, కంబిడి లతకూమరి, స్వరూప, అమర్ పాల్గొన్నారు.

## మన్యంలో చలి పంజా

మంటను కాగుతున్న గిరిజనులు

**చింతపల్లిలో 2, మినుములూరులో 6 డిగ్రీలు నమోదు**

**ప్రజాశక్తి-పాడేరు టౌన్:** అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు డివిజన్ పరిధిలో కనిష్ట ఉష్ణోగ్రతలతో మన్యం ప్రాంతమంతా తీవ్రమైన చలి నెలకొంది. గత రెండు రోజుల నుంచి పాడేరు, అరకులోయ, చింతపల్లి ప్రాంతాల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదైంది. ఈ సీజన్ లో ఇదే అతి తక్కువ డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు అని వ్యవసాయ పరిశోధన కేంద్రం అధికారులు చెబుతున్నారు. ఆదివారం చింతపల్లి వ్యవసాయ పరిశోధన కేంద్రంలో 1.5, సోమవారం 2 డిగ్రీలు నమోదు కాగా, పాడేరు మండలం మినుములూరు కేంద్ర కాఫీబోర్డులో ఆదివారం 6, సోమవారం 6 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. సాయంత్రం 5 నుంచి చలిగాలులు వీస్తున్నాయి. ఉదయం 10 గంటల వరకు ఏజెన్సీలోని అన్ని ప్రాంతాల్లోను పొగమంచు దట్టంగా కురుస్తోంది. పొగమంచుతో పాటు చలిగాలులు వ్యాపిస్తుండటంతో ప్రజలు, పర్యాటకులు తీవ్రమైన చలితో ఇబ్బందులు పడుతున్నారు. పాడేరు పట్టణంలో పలుచోట్ల ప్రజలు చలిమంటలను ఆశ్రయించారు. పొగ మంచు దట్టంగా వ్యాపించడంతో లైట్లు వేసుకుని చోదకులు వాహనాలను నడుపు తున్నారు.

**దట్టంగా కురుస్తున్న మంచు**

**పెదబయలురూరల్:** మండలంలో గత రెండ్రోజుల నుండి చలి తీవ్రత పెరిగింది. పర్రెడ ప్రాంతంలోని వరి పొలాలు, కుప్పలపై మంచు గడ్డలు దర్శనం ఇచ్చాయి. ఉదయం 10గంటలు దాటినా మంచు వీడకపోవడంతో జనాలు బయటకు రాలేదు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న జయమాధవ్, చిత్రంలో జెన్‌కో ఇఇ లక్ష్మీనారాయణ

## న్యూట్రిషన్ ఫుడ్‌పై అవగాహన సదస్సు

**ప్రజాశక్తి -సీలేరు**

న్యూట్రిషన్ ఫుడ్ వలన కలిగే లాభాలపై జయ మాధవ్ వెల్‌నెస్ వరల్డ్ ఆధ్వర్యంలో సోమవారం జికె.వీధి మండలం సీలేరు ఎపి జెన్‌కో షెటిల్ స్టేడియంలో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపీ జెన్కో ఈఈ లక్ష్మీనారాయణ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. వెల్‌నెస్ వరల్డ్ ప్రతినిధి జయ మాధవ్ మాట్లాడుతూ అన్ని జబ్బులకు అధిక బరువే కారణమన్నారు. మంచి ఆహారం, మందులు ఉండాలని, అయితే మందులే ఆహారం కారాదని సూచించారు. మంచి న్యూట్రిన్ ఫుడ్ తీసుకొని బరువు తగ్గడమే కాకుండా ఆరోగ్యాన్ని సుఖమయం చేసుకోవచ్చని పేర్కొన్నారు. మూడు రకాల న్యూట్రిషన్ ఫుడ్ ఇవ్వడం జరుగుతుందని, దీనిని వినియోగించడం వల్ల చర్మం కాంతివంతంగా ఉంటుందన్నారు. ప్రస్తుతం ఆయాసం, బిపి, గ్యాస్ట్రిక్, షుగరు, వెన్నునొప్పి, థైరాయిడ్, పక్షవాతం, మోకాళ్ల నొప్పులు, గుండెకు సంబంధించిన వ్యాధులు, హార్మోన్ సమస్య, శరీరం మీద భారం పెరుగుట వంటి సమస్యలు అందరిలోనూ ఉంటున్నాయని చెప్పారు. ఆహారపు అలవాట్లు మార్చుకోవాలని, సమయానికి ఆహారం, నిద్ర ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఫాస్ట్ ఫుడ్స్ తినకుండా జాగ్రత్తలు తీసుకుంటే ఆరోగ్యం కాపాడుకోవచ్చునని తెలిపారు. న్యూట్రిషన్ ఫుడ్ కావలసినవారు 9640562323, 8639921561 నెంబర్లకు సంప్రదిస్తే పోస్టల్ ద్వారా పొందవచ్చునని చెప్పారు. చెకప్ చేయించుకునేందుకు రోగులు టిఫిన్ చేయకుండా ఉదయం 8 నుండి 10 గంటల లోపు సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీ జెన్కో ఏడిఏ క్రాంతి, ఏఈలు రమేష్, కిరణ్, జేఏఓ మైలిపల్లి జోగారావు, ఏపీ జెన్కో కార్మికులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిఐటియు నేత చిన్నయ్యపడాల్

## ప్రశ్నించే గొంతులను నొక్కేందుకే జిఒ 1 జారీ

**- సిఐటియు జిల్లా అధ్యక్షులు చిన్నయ్య పడాల్**

**ప్రజాశక్తి-జి.మాడుగుల:** ప్రశ్నించే గొంతుల్ని నొక్కేందుకే రాష్ట్ర ప్రభుత్వం జిఒ 1ను తీసుకొచ్చిందని సిఐటియు అల్లూరి జిల్లా అధ్యక్షులు బోనంగి చిన్నయ్య పడాల్ విమర్శించారు. మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన అంగన్వాడి కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జిఒ 1తో ప్రజల నుండి కూడా వ్యతిరేకత వ్యక్తం అవుతుందని, ప్రభుత్వం భయపడే ఉద్యమాలు, పోరాటాలపై ఉక్కు పాదం మోపు తోందన్నారు. ప్రశ్నించే ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని కోరారు. అంగన్వాడీల సమస్యలపై 9 అంశాలతో కూడిన వినతి పత్రాన్ని ఐసిడిఎస్ పిఓకు అందజేశారు. ఈ నెల 10న సమస్యల పరిష్కారం కోసం మండల కేంద్రంలో ర్యాలీలు, 24, 25న ఐసిడిఎస్ ప్రాజెక్ట్ ముందు సామూహిక నిరాహార దీక్షలు చేయనున్నట్లు చెప్పారు. గత సంవత్సరం విధుల్లో చేరిన అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్, మిని కార్యకర్తలకు 9 నెలల బకాయి జీతాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి జె.దీనబంధు, ధర్మన్నపడాల్, ప్రాజెక్టు అధ్యక్షులు ఎం.వెంకటలక్ష్మి, రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

**పెదబయలు** :జిఓ 1ను రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేయాలని సోమవారం సీపీఎం జిల్లా కమిటీ నాయకులు బోండా సన్నిబాబు, కిల్లో సరబన్నలు స్థానిక రెవిన్యూ జూనియర్ అసిస్టెంట్ శాంతికు వినతి పత్రం అందజేశారు. అనంతరం సన్నిబాబు మాట్లాడుతూ, ధర్నాలు, ర్యాలీలు, రాస్తారోకోలు, సభలు నిర్వహించరాదని ప్రభుత్వం గొంతు నొక్కడం సరికాదన్నారు.ప్రభుత్వం తీసుకొన్న ఈ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని కోరారు. మండల కార్యదర్శి పృథ్వీ రాజ్ మాట్లాడుతూ, ప్రజా సామ్య దేశంలో సభలు, సమావేశాలు జరుపుకొనే హక్కు దేశంలో ప్రతి పౌరుడికి ఉందన్నారు. ఏకపక్ష నిర్ణయాలు తీసుకుని ప్రజాస్వామ్యాన్ని ఖూని చేయడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం వైస్ ప్రెసిడెంట్ బోండా గంగాధర పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాన్ని ఆదుకోవాలి

**సిపిఎం జిల్లా కార్యదర్శి కిరణ్**

మాట్లాడుతున్న సిపిఎం రంపచోడవరం జిల్లా కార్యదర్శి కిరణ్

**ప్రజాశక్తి-చింతూరు**

మండలంలోని ఇర్కంపేట గ్రామంలో భార్య, భర్తలు, వారి శిశువు మృతి చెందిన నేపథ్యంలో ఆ దంపతుల కుటుంబానికి ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్ డిమాండ్ చేశారు. దంపతులు చనిపోతే ఇప్పటి వరకు కనీసం అధికారులు గ్రామానికి సందర్శించకపోవడం, వారికి ఆర్థిక సాయం అందించకపోవడం బాధాకరమన్నారు. సోమవారం సీపీఎం, టీడీపీ నాయకులు ఇర్కంపేట గ్రామాన్ని సందర్శించి, కొవ్వాసి కమల కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడుతూ గ్రామానికి మౌలిక సౌకర్యాలు కల్పించాలని, ఆహారం, ఆరోగ్యంపై ఆదివాసీ గ్రామాలలో ప్రభుత్వం అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి సీసం సురేష్, నాయకులు మల్లం సుబ్బమ్మ, పోడియం లక్ష్మణ్, ఇర్పా అజయ్, తెలుగుదేశం మండల అధ్యక్షులు ఇల్లా చిన్నారెడ్డి, నాయకులు వెంకటేశ్వర్లు, అనిగా చంద్రయ్య, శీలం తమ్మయ్య, రామారావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## దారకొండలో సంక్రాంతి సంబరాలు

విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం, సంబరాల్లో పాల్గొన్న చిన్నారులు, మహిళలు

**ప్రజాశక్తి -సీలేరు**

జీకే వీధి మండలం, దారకొండలో సోమవారం సంక్రాంతి సంబరాలు ప్రారంభమయ్యాయి. ప్రభుత్వ యుపి స్కూల్ వద్ద డూడూ బసవన్న కటౌట్లు నెలకొల్పి గ్రామ పెద్దలు సంబరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా చిన్నారుల ఆట పాటలు, మహిళలకు రంగవల్లి పోటీలు ప్రధానోపాధ్యాయురాలు భారతి కుమారి ఆధ్వర్యాన నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని రంగవల్లులు పోటీల్లో వారి ప్రతిభను కనిపించారు. పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు దక్కించుకున్న వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు సుంకర విష్ణుమూర్తి, ఉపాధ్యాయులు నాగరత్నం, కుమారి, మరియమ్మ, తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఇఒ

## మెనూ అమలు చేయాలి : ఎంఇఒ

**ప్రజాశక్తి-హుకుంపేట:** విద్యార్థులకు మెనూ అమలు చేయాలని మండల విద్యాశాఖ అధికారి ఎస్.రామచంద్రరావు సూచించారు. గత్తుం పంచాయతీ చీకటిపుట్టు, ఎంపీపీ స్కూల్‌ను ఎంఇఒ సందర్శించి మధ్యాహ్నం భోజన పథకాన్ని పరిశీలించారు విద్యార్థులకు మెనూ ప్రకారం రోజువారి ఆహారాన్ని అందించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో విద్య కో ఆర్డినేటర్ జయరాజు తదితరులు పాల్గొన్నారు.

## బాస్కెట్ బాల్ సెలక్షన్స్‌లో గోదావరి జట్లు విజయకేతనం

**ప్రజాశక్తి-అనకాపల్లి**

స్థానిక ఏఎంఏఎల్ కళాశాలలో మూడు రోజుల పాటు అండర్-19 బాలురు, బాలికల విభాగాల్లో జరిగిన అంతర్ జిల్లా బాస్కెట్‌బాల్ సెలక్షన్స్‌లో గోదావరి జిల్లాలు విజయకేతనం ఎగురవేశాయి. బాలుర విభాగంలో 11 జట్లు, బాలికల విభాగంలో పది జట్లు పాల్గొన్నాయి. సోమవారం జరిగిన ఫైనల్స్‌లో బాలుర విభాగంలో చిత్తూరు, తూర్పుగోదావరి జిల్లాలు, బాలికల విభాగంలో కృష్ణ, పశ్చిమగోదావరి జిల్లాల జట్లు తలపడ్డాయి. ఈ పోటీల్లో బాలుర విభాగంలో తూర్పుగోదావరి, బాలికల విభాగంలో పశ్చిమగోదావరి జట్లు విజయం సాధించి ఎంపికయ్యాయి. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జయ బాబు మాట్లాడుతూ గెలిచిన క్రీడాకారులకు మంచి భవిష్యత్తు ఉండాలని, ఓడిపోయిన వారు క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యక్ష కార్యదర్శులు మంగరాజు, దాడి శ్రీనివాసరావు, సభ్యులు బాలకృష్ణ, వైస్ ప్రిన్సిపల్ మహేశ్వరరావు, బాస్కెట్బాల్ స్టేట్ అబ్జర్వర్ ఎంఎం శ్రీనివాసరావు, జిల్లా ఇంటర్ విద్య శాఖ అధికారి పి.మురళీధర్, ఎస్‌జిఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ రాంబాబు, కళాశాల సూపరింటెండెంట్ అనురాధ, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ స్వామి నాయుడు, అసిస్టెంట్ ఫిజికల్ డైరెక్టర్ నాయుడు, పాల్గొన్నారు.

సమస్యలు తెలుసుకుంటున్న టిడిపి నాయకులు

## రేఖపల్లిలో 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి'

**ప్రజాశక్తి- విఆర్.పురం**

మండలం కేంద్రం రేఖపల్లి గ్రామంలో తెలుగుదేశం పార్టీ మండల నాయకులు సోమవారం ఇదే ఖర్మ మన రాష్ట్రానికి అనేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు ప్రతి ఇంటికి వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలో నిత్యవసర సరుకులు పెరిగాయని, వ్యవసాయ రైతుల గిట్టుబాటు ధరలు శూన్యమని స్థానికులు తెలిపారు. ప్రతి ఇంటి నుండి వాళ్ళ మొబైల్‌తో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం సంబంధించి టోల్ ఫ్రీ 9261292612 నెంబర్‌కు మిస్డ్ కాల్ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు ఆచంట శ్రీనివాస్, కార్యదర్శి బురక కన్నారావు, జడ్పిటిసి వాళ్ళ రంగారెడ్డి, మాజీ జెడ్పిటిసి ముత్యాల రామారావు, ఎంపిటీసీ వాళ్ళ వెంకటేశ్వర రెడ్డి, రాజేంద్రప్రసాద్, రాష్ట్ర తెలుగు యువత ఆర్గనైజింగ్ సెక్రటరీ బొర్రా నరేష్ కుమార్, వాణిజ్య విభాగం నాయకులు బీరకా సూర్య ప్రకాష్‌రావు, ముత్యాల రాంబాబు, గొర్రె సీతారామయ్య, కోట్ల సీతారామరాజు తదితరులు పాల్గొన్నారు.

## భోగి రోజు తాళ్లపాలెం వారపు సంత

**ప్రజాశక్తి- కశింకోట :** మండలంలోని తాళ్ళపాలెం వారపు సంత ఈ నెల 14న భోగి పండుగ రోజు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు సోమవారం దండోర వేయించారు. ఈ వారపు సంత ప్రతి సోమవారం జరుగుతున్న విషయం విధితమే. సంక్రాంతి పండుగ నేపథ్యంలో వచ్చే సోమవారం జరగాల్సిన సంతను భోగి రోజుకు మార్పు చేశారు. ఈ విషయాన్ని సోమవారం జరిగిన సంతలో దండోరా ద్వారా తెలియజేశారు. మారుమూల గ్రామాలు నుండి వచ్చే అమ్మకాలు, కొనుగోలు దారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# పకడ్బందీగా ఓటర్ల నమోదు : కలెక్టర్

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

**ప్రజాశక్తి పాడేరు:** ఓటరు నమోదు ప్రక్రియ పగడ్బందీగా చేయాలని, దీనిలో నిర్లక్ష్యం వహించినా, క్రమశిక్షణ లోపించినా సహించేదిలేదని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ హెచ్చరించారు. సోమవారం కలెక్టరేట్ నుంచి ఐటిడిఎ పిఒలు, సబ్ కలెక్టర్లు, తహశీల్దార్లు, మండల సర్వేయర్లు, ఇతర అధికారులతో ఓటరు నమోదు, రీసర్వేపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పివిటిజి ఓటరు నమోదు సక్రమంగా చేయాలన్నారు. 18ఏళ్లు నిండిన పివిటిజిలను ఓటరు జాబితాలో చేర్చాలని ఆదేశించారు. మండలాల్లో 18 ఏళ్లు వయస్సు నిండిన మహిళలు, పురుషులు ఎంత మంది ఉన్నారో గుర్తించి ఓటరు జాబితాలో పొందుపరచాలని స్పష్టం చేసారు. స్టేషనరీ అవసరమైన నిధులు తాహశీల్దారులకు విడుదల చేసామని, ఫారం 6, 7లను బూత్‌స్థాయి అధికారులకు పూర్తి స్థాయిలో సరఫరా చేయాలని సూచించారు. ఓటర్ల నమోదుకు సంబంధించిన దరఖాస్తుల స్వీకరణ, వాటి పరిశీలన, నమోదు సక్రమంగా నిర్వహించాలని సూచించారు.

**ఫిబ్రవరి నెలాఖరుకు వంద గ్రామాల్లో భూముల రీసర్వే**

సమయం వథాచేయకుండా భూముల రీసర్వే ప్రక్రియ వేగవంతం చేసి, ఫిబ్రవరి నెలాఖరు నాటికి 100 గ్రామాల్లో పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. 9(2) నోటీస్ ఎంత మందికి ఇచ్చారని, ఎన్ని గ్రామసభలు నిర్వహించారని అడిగి తెలుసుకున్నారు. మ్యుటేషన్ ప్రక్రియలో ఫ్యామిలీ సర్టిఫికేట్ జారీ చేయాల్సిన బాధ్యత తహశీల్దారులపైనే ఉందన్నారు. గిరిజనుల సాగులో ఉన్న పోరంబోకు భూములకు డి ఫారం పట్టాలు పంపిణీ చేయడానికి అవసరమైన ప్రదిపాదనలు రూపొందించాలని సూచించారు.. ఎయిర్‌టెల్ టవర్ల నిర్మాణానికి భూములను గుర్తించాలని తాహశీల్దార్లకు సూచించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ జె.శివ శ్రీనివాసు, బటిడిఎ పిఒ రోణంకి గోపాలకృష్ణ, సబ్ కలెక్టర్ వి.అభిషేక్, సర్వే సహాయ సంచాలకులు వై.మోహనరావు, తహశీల్దార్లు పాల్గొన్నారు.

# పోలీస్‌స్టేషన్‌ను డిఐజి ఆకస్మిక తనిఖీ

పోలీస్‌స్టేషన్ సందర్శనలో డిఐజి హరికృష్ణ, పక్కనే అల్లూరి ఎస్‌పి , చింతపల్లి ఎఎస్‌పి

**ప్రజాశక్తి జి.మాడుగుల** : స్థానిక పోలీస్‌స్టేషన్‌ను విశాఖ రేంజ్ డిఐజి హరికృష్ణ సోమవారం ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. స్టేషన్‌లోని పలు రికార్డులను తనిఖీ చేశారు. స్టేషన్ పరిసరాలను పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. అల్లూరి జిల్లా ఎస్‌పి సతీష్ కుమార్, చింతపల్లి ఎఎస్‌పి ప్రతాప్ శివకిషోర్ ఉన్నారు. ఈ సందర్భంగా జి మాడుగుల సిఐ సత్యనారాయణ, ఎస్ఐ శ్రీనివాస్, పోలీస్ సిబ్బందిని అభినందించారు

# పథకాల అమలులో భాగస్వాములను చేయండి

## మండల సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధులు

మాట్లాడుతున్న ఎంపిపి

**ప్రజాశక్తి-ముంచింగిపుట్టు:** ప్రభుత్వ పథకాలు, అంగన్వాడి కేంద్రాల ద్వారా ఇస్తున్న పాలు, గుడ్లతో పాటు ఇతర పౌష్టికాహార సరుకుల పంపిణీలో స్థానిక సర్పంచులు, వార్డు సభ్యులకు సమాచారం అందించి భాగస్వామ్యం చేయాలని కోర్యాం సర్పంచ్ పి.కొముల కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం మండల ఎంపీపీ బి.ఈశ్వరి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఉద్యోగులు ఉదయం 9 గంటల నుంచి నాలుగు గంటల వరకు విధులు నిర్వహించాలని పలువురు ప్రజాప్రతినిధులు సమావేశంలో అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. సాగర పంచాయతీ కోర్యాం, కొత్తపుట్టు పంచాయతీ గ్రామాల్లో మరమ్మతులకు గురైన విద్యుత్ పోల్సును పునరుద్ధరించాలని ఆ పంచాయతీ సర్పంచులు అధికారులను నిలదీశారు. కిల్లోగూడ జంక్షన్ నుంచి సొవ్వా వరకు అసంపూర్తిగా మిగిలిన రోడ్డును పూర్తిస్థాయిలో నిర్మించాలని ఆ పంచాయతీ ప్రజాప్రతినిధులు డిమాండ్ చేశారు.

అనంతరం ఎంపీపీ ఈశ్వరి మాట్లాడుతూ, ప్రజా సమస్యల పరిష్కారానికి సర్వసభ్య సమావేశ వేదికను ప్రతి ఒక్క ప్రజాప్రతినిధులు సద్వినియోగ పరచుకోవాలన్నారు. గ్రామాల్లో ఎదురవుతున్న సమస్యలను తమ దృష్టికి తీసుకు వచ్చి పరిష్కరించుకోవాలని ఆమె కోరారు. ఈ సమావేశంలో ఎంపీడీవో ఎస్.ఆనంద్, లలిత, సర్పంచ్ ఫోరం మండల అధ్యక్షుడు కే.హరి, ఎంపీడీవో నగేష్, ఎంపిటిసిలు, సర్పంచులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

కలుసుకున్న పూర్వ విద్యార్థులు

**ప్రజాశక్తి -ముంచింగిపుట్టు:** మండలంలోని కిందమండ గిరిజన ఆశ్రమ పాఠశాలలో 1996 బ్యాచ్ పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం సోమవారం ఆ పాఠశాలలో నిర్వహించారు. తమ బ్యాచ్‌లో చదువుకున్న 97 మంది విద్యార్థులు పోర్టు, విద్య, వైద్య, వ్యవసాయం, పశుసంవర్ధక, ఆశ్రో, రెవెన్యూ శాఖలతోపాటు మిలటరీలో స్థిరపడిన వారంతా మళ్లీ ఒకచోట కలుసుకుని పాతజ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. పరస్పర యోగక్షేమాలను తెలుసుకున్నారు. గిరిజన సంప్రదాయమైన థింసా నృత్యం, ఆటపాటలతో సందడి చేశారు. ఇదే బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ప్రస్తుతం సీనియర్ ఉపాధ్యాయులుగా విధులను నిర్వర్తిస్తున్న కిరసాని రామారావు, బంటు అప్పలరాజులతోపాటు పలువురు పాల్గొన్నారు.

# జిమ్నాస్టిక్స్ విజేతలకు బహుమతులు

**ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ** : పాండురంగాపురం డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ హాల్లో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ అంతర జిల్లాల జిమ్నాస్టిక్ ఛాంపియన్‌షిప్-2023 పోటీల్లో విజేతలకు విశాఖ జిల్లా షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షులు, ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస యాదవ్ బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా వంశీకృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు ప్రత్యేక స్థానాన్ని కల్పిస్తూ క్రీడాకారులకు ప్రోత్సాహకాలను అందిస్తోందన్నారు. కార్యక్రమంలో సూర్యకుమార్, కల్యాణ్, జైన్ తదితరులు పాల్గొన్నారు.

# జలజీవన్ మిషన్ పనుల్లో నిర్లక్ష్యం!

- మూడునెలలుగా నిలిచిన పనులు
- ముంచుకొస్తున్న వేసవి నీటి ఎద్దడి
- సిపిఎం మాజీ సర్పంచ్ సివేరి కొండలరావు

జలజీవన్ మిషన్ పనుల కోసం తెచ్చిన పైపులను పరిశీలిస్తున్న కొండలరావు

**ప్రజాశక్తి-అనంతగిరి** :జల జీవన్ మిషన్ పనుల్లో నిర్లక్ష్యం తగదని సిపిఎమ్‌కు చెందిన వేంగడ మాజీ సర్పంచ్ సివేరి కొండలరావు ఆవేదన వ్యక్తం చేశారు. మూడు నెలలుగా పనులు నిలిచిపోయాయని, ఇలాగైతే రానున్న వేసవిలోగా పనులు పూర్తిచేసి, ఇంటింటికీ కుళాయిల ద్వారా తాగునీరు అందిచడం కష్టమేనని విమర్శించారు.

వెంటనే పనులు పున:ప్రారంభించి పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. సోమవారం వేంగడ పంచాయతీని సందర్శించారు. తాగునీరు, ఇతర సమస్యలపై స్థానికులతో మాట్లాడారు.

ఈ సందర్భంగా కొండలరావు మాట్లాడుతూ, వేంగడ పంచాయతీలో వేసవిలో ఏటా తాగునీటి ఎద్దడిన నెలకొంటోందన్నారు. జలజీవన్ మిషన్ పథకం కింద రూ.24లక్షలు మంజూరుచేసి పనులు ప్రారంభించడంతో ఇక తమ నీటికష్టాలు గట్టెక్కినట్టేనని గిరిజనులంతా ఆనందపడ్డారన్నారు. పైపులు తెచ్చి, పనులు మొదలెట్టిన సంబంధిత కాంట్రాక్టర్, మూడు నెలలుగా పనులు నిలిపేసి పత్తా లేకుండా పోయారు. దీంతో పథకం పూర్తవుతుందో, లేదోనని వేంగడ వాసులు ఆవేదన చెందుతున్నారు. అందుకు కారణం లేకపోలేదని, గతంలో 2017-18లోనూ గ్రావిటీ పథకం ద్వారా తాగునీరు అందించేందుకు అప్పట్లోనూ ఇదే రూ.24లక్షలు మంజూరు చేశారని, పనులు మొదలెట్టి, మధ్యలోనే నిలిపేయడడంతో ప్రజల నీటికష్టాలు అలాగే ఉండిపోయాయన్నారు. అప్పట్లో చేపట్టి పనులకు సాక్ష్యంగా దిష్టిబొమ్మలా ట్యాంకర్ ఉందని కొండలరావు వివరించారు. ఇపుడు కూడా పైపులు తెచ్చి, పనులు చేపట్టకుండా వదిలేయడంతో అప్పటి పరిస్థితులు పునరావృతమౌతాయోమోనని వేంగడ వాసుల్లో ఆందోళన నెలకొందన్నారు ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, జలజీవన్ మిషన్ పనులను పున:ప్రారంభించి, త్వరితగతిన చేపట్టి పూర్తిచేయాలని, తద్వారా రానున్న వేసవిలోగా వేంగడలో నీటి సౌకర్యం కల్పించాలని కొండలరావు డిమాండ్ చేశారు. పనులు చేపట్టకుండా బిల్లులు డ్రాచేస్తే ఊరుకునేది లేదని, దీనిపై జిల్లా కలెక్టర్,పిఒ ఇతర అధికారులు దృష్టి పెట్టాలని కొండలరావు కోరుతున్నారు.

# వారపు సంతల్లో మోసాలను అరికట్టాలి

## గిరిజనులకు అవగాహన కల్పిస్తూ సిపిఎం ఆధ్వర్యాన ప్రచారం

వారపుసంతలో ప్రచారం చేస్తున్న సిపిఎం బృందం

**ప్రజాశక్తి- పెదబయలు** : వారపుసంతల్లో తూనికలు, కొలతతోపాటు సరుకుల నాణ్యతలో మోసాలకు ప్రభుత్వం అడ్డుకట్ట వేయాలని మండల సిపిఎం కార్యదర్శి కొమ్ము పృధ్వీరాజ్ కోరారు. సోమవారం పృధ్వీరాజ్ ఆధ్వర్యంలో సిపిఎం బృందం వారపుసంతలో మోసాలపై గిరిజనులకు అవగాహనకు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పృధ్వీరాజ్ మాట్లాడుతూ, వారపుసంతల్లో గిరిజన ఉత్పత్తులకు ప్రభుత్వ ప్రకటించిన మద్దతు ధరలకు సంబంధిత పట్టికను ప్రకటిచాలని, అలాగే ప్రభుత్వ నిబంధనలను వ్యాపారులు, జిసిసి అమలు చేస్తుందో? లేదో సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో సమగ్ర పర్యవేక్షణ చేయాలని కోరారు.

వారపుసంతల్లో తాగునీరు, మరుగుదొడ్లు, దుకాణ సముదాయాలు, ఇతర సౌకార్యాలను కల్పించాలని కోరారు. అలాగే గిరిజనులు తాము పండించిన ఉత్పత్తులకు గిట్టుబాటు ధర వచ్చేంత వరకు నిల్వ ఉంచేందుకు గిడ్డంగులను నిర్మించాలని డిమార్ చేశారు. వారపుసంతలో పిప్పళ్లు, బొస్తరి పిక్కలు, రాజ్‌మా, అలిసెలు, డ్రై కాఫీ పిక్కలు, ఇతర గిరిన అమ్ముకోవడానికి అవకాశం కల్పించాలని కోరారు. ప్రభుత్వం వెంటనే స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

# హైడ్రో పవర్ ప్రాజెక్టు రద్దుకు పోరాటం

## టిడిపి ఆధ్వర్యాన ఆందోళన, వినతి

ధర్నాలో మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రావణ్‌కుమార్

**ప్రజాశక్తి -అనంతగిరి** : మండలంలోని టోకూరు పంచాయతీ చిట్టంవలస, పెద్దకోట పంచాయతీ రేగుల పాలెం, గుమ్మ కోట పంచాయతీ గుజ్జలి గ్రామాల వద్ద ప్రతిపాదించిన హైడ్రోపవర్ ప్రాజెక్టును తక్షణమే రద్దు చేయాలని మాజీ మంత్రి, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కిడారి శ్రావణ్‌కుమార్ డిమాండ్ చేశారు. మన్యంలో గిరిజనులకు, పర్యావరణానికి నష్టం కలిగించే ఈ ప్రాజెక్టు రద్దు చేసేంతవరకు టిడిపి పోరాటం సాగిస్తుందని స్పష్టం చేశారు. సోమవారం మండల కేంద్రం వద్ద టిడిపి ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు.మూడురోడ్ల కూడలి నుంచి తహశీల్దార్ కార్యాలయ వరకు ర్యాలీ నిర్వహించి, రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందజేశారు. హైడ్రోపవర్ ప్రాజెక్ట్ నిలుపుదల చేయాలని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మొండివైఖరి నశించాలని నినాదాలు చేశారు.

ఈ సందర్భంగా మాజీ మంత్రి శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ ఆదానీ, అంబానీలకు ప్రయోజనం చేకూర్చి, గిరిజనులకు నష్టం కలిగించడమే కాకుండా, వారి మనుగడకు విఘాతం కలిగించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరించడం దారుణమన్నారు. తక్షణమే ప్రాజెక్టుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన అనుమతులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దీనికి వ్యతిరేకంగా, గిరిజనం పక్షాన టిడిపి పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో బాజీ, ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ మాజీ సివేరి అబ్రహం, టిడిపి మండల నాయకులు బుజ్జిబాబు, ఆనంద్, జోగులు, లక్ష్మణరావు, నిర్మల పాల్గొన్నారు

# మన్యంలో మౌలిక సౌకర్యాల కల్పనకు కృషి

## పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి

## రూ.2.20 కోట్లతో కోడిమామిడి, కిల్లంకోట వంతెన నిర్మాణం

వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే, పిఒ

**ప్రజాశక్తి -జి.మాడుగుల** : మన్యంలో మౌలిక సౌకర్యాల కల్పన, అభివృద్ధికి ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి విశేషంగా కృషి చేస్తున్నారని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి అన్నారు. సోమవారం పాడేరు కనెక్టివిటీలో భాగంగా మండలంలోని కిల్లంకోట నుంచి కోడిమామిడికి గెడ్డపై రూ.2.20కోట్ల ఎస్‌సిఎ నిధులతో వంతెన నిర్మాణానికి ఐటిడిఎ పిఒ రోణంకి గోపాలకృష్ణతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మూడు రాష్ట్రాల సరిహద్దులోని 30 గ్రామాల ప్రజలు పాడేరు జిల్లా కేంద్రానికి, జి.మాడుగుల మండల కేంద్రానికి వెళ్లాలంటే వర్షాల సీజన్‌లో కోడిమామిడి గెడ్డ వద్ద రాకపోకలకు ఏళ్ల తరబడి పడుతున్న ఇబ్బందులను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లగా వెంటనే నిధులు మంజూరు చేశారన్నారు. ఇపుడు పనులు ప్రారంభించామన్నారు. మారుమూల గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పనకు, విద్య, వైద్యం ఇతర సౌకర్యాలకు ఏటా కోట్లాది రూపాయలు వెచ్చిస్తూ, గిరిజన పక్షపాతిగా సిఎం జగన్ వ్యవహరిస్తున్నారన్నారు. పనులు పూర్తయితే ఈ ప్రాంతవాసుల రాకపోకల కష్టాలు తీరినట్టేనని అన్నారు.

**పనులు పూర్తయితేనే ఆనందం**

కిర్లంకోట మాజీ సర్పంచ్ ఎం. ప్రసాద్‌రాజు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా కోడిమామిడి గెడ్డ వద్ద రాకపోకలకు ఇబ్బందులు పడుతూనే ఉన్నామన్నారు. ప్రస్తుతం వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేసి, పనులు ప్రారంభించడం హర్షనీయమైనా, వంతెన పూర్తయి, దానిమీదుగారాకపోకలు సాగించిన నాడే నిజమైన ఆనందమన్నారు. పనులకు శంకుస్థాపన చేసి, మధ్యలోనే వదిలేయకుండా, నేతలు, అధికారులు సంబంధిత కాంట్రాక్టర్ వెంటబడి, త్వరితగతిన పూర్తి చేయించాలని వేడుకున్నారు.

ఐటిడిఎ పిఒ రోణంకి గోపాలకృష్ణ మాట్లాడుతూ, కోడిమామిడి వద్ద వంతెన నిర్మాణ కోసం ప్రజా ప్రతినిధులు ఎన్నోసార్లు తన దృష్టికి తేగా, ప్రభుత్వానికి నివేదించానని, ఇపుడు నిధులు మంజూరు చేశారన్నారు.

కార్యక్రమంలో జి మాడుగు జెడ్‌పిటిసి, వైసిపి రాష్ట్ర ఎస్‌టి సెల్ (కొండప్రాంతం) అధ్యక్షురాలు డాక్టర్ వెంకటలక్ష్మి, ఎంపిపి కొర్ర పద్మ, జికె.వీధి జెడ్‌పిటిసి ఎం.శివరత్నం, రాష్ట్ర ఎస్‌టి సెల్ సభ్యులు ఎం విశ్వేశ్వరరాజు, స్థానిక సర్పంచ్ ముత్యాలమ్మ, ఎంపిటిసి అప్పలరాజు, పిఎసిఎస్ చైర్మన్ మత్స్య కొండబాబు, బొయితిలి సర్పంచ్ మాలన్న, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు రామకృష్ణ, రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ మెంబర్ డాక్టర్‌నరసింహారావు, మండల ఇంజనీరింగ్ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# అసత్య ఆరోపణలు అయ్యన్నకు తగవు : ఎమ్మెల్యే గణేష్

**ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్:** మాజీ మంత్రి, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యుడు అయ్యన్న పాత్రుడు తమ నాయకులు, ప్రభుత్వంపై అసత్య ఆరోపణలు చేయడం తగదని స్థానిక ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ తెలిపారు. ఈ మేరకు సోమవారం మీడియాకు వీడియోను విడుదల చేశారు. గత తెలుగుదేశం ప్రభుత్వం కాలంలో దుర్మార్గ పాలన అందించారన్నారు. ఐదారు నెలలో ఎన్నికలు వస్తాయని భావించి ఆఖరి సమయంలో అన్న క్యాంటీన్లు పెట్టారన్నారు. ఉద్యోగాల గురించి మాట్లాడే అర్హత అయ్యన్న పాత్రుడుకు లేదన్నారు. ఇంటికో ఉద్యోగం ఇస్తామని చంద్రబాబు, అయ్యన్న పాత్రుడులు ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చారని గుర్తు చేశారు. నర్సీపట్నంలో 60 వేల నుండి 70 వేల ఇల్లు ఉన్నాయని ఎంతమందికి ఉద్యోగం ఇచ్చారని ప్రశ్నించారు. పెన్షన్ల గురించి మాట్లాడే అర్హత అయ్యన్నపాత్రుడు, చంద్రబాబులకు లేదని, తమ ప్రభుత్వం రూ.3000 వరకు పెంచుతుందని తెలిపారు. రిటైర్డ్ ఉద్యోగులకు పెన్షన్ ఇవ్వలేదని అయ్యన్న విమర్శిస్తున్నారని, బుద్ధిలేని మాటలు ఆడొద్దని వారిని అడిగి తెలుసుకోవాలని అన్నారు. ఇటువంటి అబద్ధాలు ఆడి అధికారంలో రావాలని చూస్తున్నారని, ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకొని మసలు కోవాలన్నారు. జగనన్న ప్రభుత్వంలో తెలుగుదేశం నాయకులు కూడా పథకాలు అందుకుంటున్నారని తెలిపారు. మరో 30 సంవత్సరాలు జగన్ ముఖ్యమంత్రిగా ఉంటారని ఈ విషయాన్ని తెలుసుకోవాలని జోస్యం చెప్పారు.

**అయ్యన్న ఆరోపణలు అర్థరహితం**

**మాకవరపాలెం:** వైసిపి ప్రభుత్వంపై మాజీ మంత్రి అయ్యన్న చేస్తున్న ఆరోపణలు అర్థరహితం అని ఎంపీపీ సత్యనారాయణ, వైసిపి మండల అధ్యక్షుడు వాసు తెలిపారు. సోమవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, అన్‌రాక్ కంపెనీలో ఎంత మందికి ఉద్యోగాలు ఇప్పించమో అయ్యన్న తెలుసుకుని మాట్లాడాలన్నారు. మెడికల్ కాలేజీ పనులు జరుగుతున్నాయని తెలిపారు. ఇప్పటికైనా వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలని ఆయన హితువు పలికారు. ఈ కార్యక్రమంలో తామరం పిఎస్సిఎస్ అధ్యక్షుడు నాగేశ్వరరావు, పెట్ల భద్రాచలం పాల్గొన్నారు.

# నవోదయ ఆరో తరగతి ప్రవేశ పరీక్షకు

# 31లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు

**ప్రజాశక్తి పాడేరు:** 2023 - 24 విద్యా సంవత్సరానికి జవహర్ నవోదయ పాఠశాలల్లో ఆరవ తరగతిలో ప్రవేశానికి ఎంపిక పరీక్ష కోసం సంబంధిత వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా ఈ నెలాఖరులోగా దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.. నవోదయ విద్యాలయాల్లో ఆరవ తరగతిలో ప్రవేశానికి ఎంపిక పరీక్ష ఏప్రిల్ 29న జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు.

# సికిల్ సెల్ ఎనీమియా బాధితులకు అండ

## ఐటిడిఎ పిఒ రోణంకి గోపాలకృష్ణ

**ప్రజాశక్తి-పాడేరు టౌన్:** ఏజెన్సీలో సికిల్ సెల్ ఎనీమియా నివారణకు కృషి చేయాలని ఐటిడిఎ పిఒ రోణంకి గోపాలకృష్ణ అన్నారు. సోమవారం పెరుమాళ్ స్వస్థ సంస్థ ఆధ్వర్యంలో ఐటిడిఎ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సమావేశ మందిరంలో యూత్ సర్టిఫికెట్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మాతా శిశు సంరక్షణపై పెరుమాళ్ సంస్థ అవగాహన కల్పించడం అభినందనీయమన్నారు. పెరుమాళ్ సంస్థ సేవలను 11 మండలాలకు విస్తరించాలన్నారు. వైద్య ఆరోగ్యశాఖ భాగస్వామ్యంతో పాఠశాల విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించాలని చెప్పారు. సికిల్ సెల్ ఎనీమియా బాధితులను గుర్తించి ప్రభుత్వం అందిస్తున్న పింఛన్లు అందేలా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

# చీకటి జిఒ1ని రద్దు చేయాలి

## రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రజా సంఘాల నేతలు

సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం మండల కార్యదర్శి రామారావు

**ప్రజాశక్తి -అరకులోయ రూరల్:** రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చి జిఒ1 వెంటనే రద్దు చేయాలని ప్రజా సంఘాల నేతలు డిమాండ్ చేశారు. సోమవారం అరకువేలి గిరిజన సంఘం కార్యాలయంలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి కె రామారావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయాలని ఆలోచనతో చీకటి కొత్త జిఒలు తీసుకొస్తున్నారాన్నారు.రాష్ట్రంలో ధర్నాలు, రాస్తారోకోలు రోడ్డు షోలు, బహిరంగ సభలపై ఆంక్షలు పెట్టేలా నిబంధనలతో కూడిన జిఒ తేవడమంటే విపక్షాలు, ప్రజాసంఘాల గొంతు నొక్కడమేనన్నారు. .ప్రజా సమస్యలపై ప్రశ్నించినా, ఆందోళనలకు పిలుపునిచ్చినా ముందస్తు అరెస్టులు, గృహనిర్బంధాలు చేయడం దుర్మార్గమన్నారు. ప్రజా సమస్యలపై ప్రశ్నించే హక్కు లేకుండ చేస్తున్నారని మండిపడ్డారు. ప్రజా సమ్యలను పరిష్కరించకుండా రాష్ట్ర ప్రజలను ఇబ్బందులకు గురిచేసే ఎటువంటి నిర్ణయాన్ని సహించబోమని, దీనిపై ప్రజలు, ప్రజాసంఘాలను సమీకరించి ఉద్యమిస్తామన్నారు. అల్లూరి ఏజెన్సీలో హైడ్రో పవర్ ప్రాజెక్టు నిర్మాణం ప్రయత్నాలను ప్రభుత్వాలు వెంటనే విరమించుకోవాలన్నారు. గిరిజన ప్రాంతంలో 1/70, పీసా తదితర చట్టాలు అమలులో ఉండగా, ప్రజాభిప్రాయ సేకరణ, గ్రామ సభ తీర్మానం లేకుండా కార్పొరేట్ సంస్థలకు ఏజెన్సీ భూములను, ఆస్తులను ఎలా కట్టబెడతారని మండిపడ్డారు. ప్రజాకంటక పాలన చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు 2024 ఎన్నికలు చెంపపెట్టు కాక తప్పదని హెచ్చరించారు. రౌండ్ టేబుల్ సమావేశంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి. బాలదేవ్, గిరిజన సంఘం మండల కార్యదర్శి పి రామన్న, కాఫీ రైతుల సంఘం మండల కార్యదర్శి సిహెచ్ గురుమూర్తి, ప్రజానాట్య మండలి జిల్లా నాయకులు టి జోషి, ఎస్ రాజు, సిహెచ్ శేఖర్, గణేష్,సాయి, రాంచందర్, రాజశేఖర్, సుబ్బు పాల్గొన్నారు.

# ప్రజా సంకల్పయాత్ర మధురమైన ఘట్టం

## పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి

**ప్రజాశక్తి-పాడేరు టౌన్:** ముఖ్యమంత్రి జగన్ ఆశయాలతోనే అభివృద్ధి సాధ్యమని, ఆయన చేసిన ప్రజా సంకల్ప పాదయాత్ర మరిచిపోలేని ఘట్టమని ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి అన్నారు. సిఎం జగన్ పాదయాత్రకు నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం పాడేరు, తలారిసింగిలోని తన నివాసంలో. వైసిపి నేతలు, కార్యకర్తల మధ్య కేక్ కట్ చేసి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పాదయాత్రలో తెలుసుకున్న సమస్యల ఆధారంగా మ్యానిఫెస్టోను రూపొందించి, వాటిని అమలు చేయడం ద్వారా సిఎం జగన్ ప్రజా సంక్షేమ పాలనతో ప్రజల మనసులో నిలిచిపోయారన్నారు. కార్యక్రమంలో ఎపి మెడికల్ కౌన్సిల్ మెంబర్ డాక్టర్ టి.నర్సింగరావు, పాడేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కె.సూరిబాబు, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ సరస్వతి, వైసిపి మండల అధ్యక్షులు సీదరి రాంబాబు, సర్పంచ్‌లు బసవన్న దొర, వంతల రాంబాబు, వంతల సీతమ్మ, ఎంపిటిసిలు లకే రామకష్ణ పాత్రుడు, కె.నరసింహమూర్తి, మాజీ ఎంపిపి మంగన్నదొర పాల్గొన్నారు.

**మళ్లీ వైసిపిదే అధికారం**

వైఎస్‌ఆర్‌కు నివాళులర్పిస్తున్న ఎంపిపి

**అనంతగిరి** : ప్రజాసంకల్పయాత్ర నాలుగేళు పూర్తయిన సందర్భంగా మండల కేంద్రంలో వైసిపి అధ్యక్షుడు శెట్టి ఆనంద్ ఆధ్వర్యాన ఎంపిపి శెట్టి నీలవేణి వైఎస్‌ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం ద్వారా రానున్న ఎన్నికల్లో వైసిపి విజయానికి అందరూ కృషి చేయాలని కోరారు. ఎంపిటిసిలు .సర్పంచులు కార్యకర్తలు పాల్గొన్నారు..

# మాటకు కట్టుబడిన వ్యక్తి సిఎం జగన్

**ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ** : ఇచ్చిన మాటకు కట్టుబడి ప్రజా పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రజల గుండెల్లో ఎప్పుడూ నిలిచే ఉంటారని నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి అన్నారు. ప్రజా సంకల్ప యాత్రకు నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం ఆర్‌కె. బీచ్ పార్క్ హోటల్ దరి వైఎస్సార్ విగ్రహానికి తూర్పు నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల, పలువురు కార్పొరేటర్లతో కలిసి పూలమాలలు సుదీర్ఘ పాదయాత్రలో ప్రజల కష్టాలు తెలుసుకుని,వాటిని మ్యానిఫెస్టోలు పెట్టి అమలు చేసిన ఘనత సిఎం జగన్‌దేనన్నారు. మరికొద్ది రోజుల్లో విశాఖను పరిపాలన రాజధానిగా చేసి, ఇక్కడ నుండే పాలన సాగించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారన్నారు. తద్వారా ఉత్తరాంధ్ర సమగ్రాభివృద్ధి సాధ్యపడుతుందని మేయర్ ఆశాభావం వ్యక్తం చేశారు.

# వైసిపి పాలనతో ఎపికి చీకటి రోజులు

## కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్

**ప్రజాశక్తి- కలెక్టరేట్:** వైసిపి ప్రభుత్వం రావడంతోనే రాష్ట్రంలో చీకటి రోజులు ప్రారంభమయ్యాయని కేంద్ర మాజీమంత్రి, కాంగ్రెస్ నేత చింతా మోహన్ ఆరోపించారు. విజెఎఫ్ ప్రెస్ క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ జిఒ1 జారీతో వైసిపి ప్రభుత్వ బండారం బయటపడింది అన్నారు. లీటర్ పెట్రోల్ ధర రూ.100 దాటిన రోజు నుంచే కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ పతనం ప్రారంభమైందన్నారు. 2024లో కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వాలు వచ్చేది లేదన్నారు. విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ ప్రభుత్వ రంగంలోనే ఉండాలంటే కేంద్రంలో బిజెపి పోవాలన్నారు. పేదల బాధలు రాసే పరిస్థితి లేనంతగా పత్రికాస్వేచ్ఛ హరించిపోయిందన్నారు. తెన్నేటి విశ్వనాథం, గౌతు లచ్చన్న వంటి సమర్థులైన నాయకులు లేకపోవడమే ఉత్తరాంధ్ర వెనకబాటుతనానికి కారణమన్నారు. సమావేశంలో నగర కాంగ్రెస్ అధ్యక్షుడు గొంప గోవిందరాజు పాల్గొన్నారు.